క్లుప్తంగా

శిల్పారామంలో దసరా ఉత్సవాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

చంద్రగిరి : తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఏఓ సూర్యతేజ తెలిపారు. గురువారం పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. శనివారం నుంచి అక్టోబర్ 2 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 8.30 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పాకాల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఐటీసీ క్యాంప్ మొబైల్ వ్యాన్ ద్వారా ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం కోర్ ఎన్‌జీటీఎస్ డీఎండీఓ శంకర్, పీఎం సద్దాం ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ రమేష్‌కుమార్ సమక్షంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ద్రాక్షాయని, లక్ష్మీ, బాలాజీ పాల్గొన్నారు.

భూమన నివాళి



నివాళులర్పిస్తున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: తిరుపతి 49వ డివిజన్ కార్పొరేటర్ అన్నా సంధ్య కుటుంబంతో కలిసి గుంటూరు వెళుతుండగా రోడ్డు ప్రమాదంలో ఆమె భర్త డాక్టర్ వెంకటకిషోర్, కుమార్తె అశ్విత దుర్మరణం చెందారు. ఇది తెలుసుకున్న చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి గురువారం గుంటూరులోని వెంకటకిషోర్ నివాసానికి వెళ్లారు. ఇద్దరి భౌతికాయాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

రోడ్డు ప్రమాదంలో డాక్టర్ కిశోర్ మృతి బాధాకరం

తిరుపతి తుడా: వ్యక్తిగత పనిమీద గుంటూరు వెళుతూ తిరుపతి నగర పాలకసంస్థ కార్పొరేటర్ డాక్టర్ సంధ్య, ఆమె భర్త డాక్టర్ కిషోర్, ఇతర కుటుంబ సభ్యులు ప్రయాణిస్తున్న వాహనం చిలకలూరిపేట వద్ద ప్రమాదానికి గురి కావడం, డాక్టర్ కిశోర్, వారి కుమార్తె చిన్నారి అశ్విత మరణించడం దిగ్భ్రాంతికి గురిచేసిందని నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. డాక్టర్ కిషోర్ మృతి సమాజానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి శ్రద్ధాంజలి ఘటించారు. సంధ్య త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్టు తెలిపారు.

శ్మశాన స్థలాన్ని పరిరక్షించండి

– ఎంఆర్ పల్లె వాసుల ని'వేదన'

తిరుపతి కల్చరల్: ముత్యాలరెడ్డిపల్లె శ్మశాన స్థలాన్ని ఆక్రమణల నుంచి పరిరక్షించాలని స్థానికులు రంగారెడ్డి, నాగేంద్ర విజ్ఞప్తి చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తిరుపతి అర్బన్ లెక్కదాఖలలోని 303/1లో ఎంఆర్‌పల్లె వాసులు వినియోగిస్తున్న 2 ఎకరాల శ్మశాన స్థలం ఆక్రమణపాలై ఎకరా వరకు కుదించుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఇద్దరు వ్యక్తులు శ్మశాన స్థలంలో తమకు 1981లో 408,409 ప్లాట్లలో 3 సెంట్ల చొప్పున పట్టా ఇచ్చారంటూ ఆక్రమణకు యత్నిస్తున్నారని, దీనిపై మున్సిపల్ కమిషనర్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులకు ఫిర్యాదు చేయడంతో వారు పరిశీలించి శ్మశాన స్థలాన్ని పరిరక్షించి, ప్రహరీ నిర్మిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా స్థానికులు దీనిని కాపాడుకునేందుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎంఆర్‌పల్లి వాసులు రాజశేఖర్, దామోదర్, బాలు, మౌలి, ధరణికుమార్, గంగులయ్య పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, తుడా చైర్మన్, టీటీడీ బోర్డు సభ్యుడు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: స్థానిక డీబీఆర్ రోడ్డులోని యాలమూరి పార్క్‌లో అయోధ్య రామ మందిరం నమూనాతో ఏర్పాటు చేసిన భువనేశ్వరి ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌ను గురువారం సాయంత్రం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, తుడా చైర్మన్ డాలర్ దివాకర్‌రెడ్డి, టీటీడీ రిటైర్డ్ డెప్యూటీ ఈవో చిన్నంగారి ప్రారంభించారు. 27 ఏళ్లుగా ప్రతి ఏటా వివిధ నమూనాలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి ప్రజలకు వినోదం పంచుతున్నట్టు ఎగ్జిబిషన్ నిర్వాహకుడు బి.శ్రీనివాస్ తెలిపారు. ఈ పర్యాయం వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 200 మంది కళాకారులతో 120 రోజులు శ్రమించి అయోధ్య మందిర నమూనా, అయోధ్య బాల రాముని ప్రతిమ, 30కిపైగా అబ్బుర పరిచే ఎమ్యూజ్‌మెంట్స్, వంద పైచిలుకు వివిధ రకాల స్టాళ్లు ఏర్పాటు చేసినట్టు వివరించారు. ప్రతి రోజూ సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు ఎగ్జిబిషన్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి, యాలమూరి నరేంద్ర పాల్గొన్నారు.





కళార్చన

తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం చిన్నశేష వాహనంపై మలయప్పస్వామి విహరిస్తూ భక్తులను కటాక్షించారు. వాహనసేవలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, అసోం, కేరళ, త్రిపుర, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలతోపాటు, కేంద్రపాలిత ప్రాంతమైన పాండిచ్చేరి నుంచి పలు కళాకారుల బృందాల ప్రదర్శనలు భక్తులను ఆద్యంతమూ భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. జానపద నృత్యాలు, కోలాటాలు, నృత్య రూపకాలు, వివిధ వాయిద్యాలతో విన్యాసాలు, కథకళి, కూచిపూడి నృత్యాలు, కుంభ మయూర నృత్యం, హోలీ నృత్యం, బోర్తాల్ నృత్యం..ఇలా ఒక్కటేమిటి..ఆయా రాష్ట్రాల కళాకారులు తమ ప్రాంతాల సాంస్కృతిక, కళారూపాలతో స్వామివారిని కీర్తించారు. దేవతామూర్తుల వేషధారణలో మెప్పించారు.

– తిరుమల

భక్తులను కటాక్షించేందుకు మాడవీధులలోకి చిన్న శేష వాహనంపై బయలుదేరిన శ్రీకృష్ణుడు



బ్రహ్మోత్సవాల్లో నేడు

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో మూడోరోజు శుక్రవారం ఉదయం శ్రీ మలయప్పస్వామివారు సింహవాహనం, రాత్రి ముత్యపుపందిరి వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. – తిరుమల











సారె సమర్పణ



హంస వాహనసేవకు సారెను తీసుకువస్తున్న నేంద్రగుంట ప్రాంత ప్రజలు





చిన్నశేషవాహన సేవకు సారె తీసుకువస్తున్న మంగళం, పద్మావతీపురం, కుంట్రపాకం ప్రాంతాల భక్తులు

తిరుపతి రూరల్ : కల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం చిన్నశేష వాహన సేవ సందర్భంగా పలు పంచాయతీలకు చెందిన భక్తులు సారె సమర్పించారు. సారె తీసుకువచ్చిన తిరుమల నగర్, న్యూ మంగళం, మంగళం క్వార్టర్స్, రణధీర పురం, సప్తగిరి కాలనీ, పద్మావతీపురం, శ్రీనివాసపురం, ఓటేరు, తణపల్లి, కుంట్రపాకం పంచాయతీలకు చెందిన భక్తులకు ఆలయం తరపున ధర్మకర్తల మండలి సభ్యులు, తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఎదురేగి సాదర స్వాగతం పలికారు. అలాగే సాయంత్రం హంస వాహన సేవకు పాకాల మండలంలోని నేంద్రగుంట, గాదంకి, ఆదెనపల్లి, కె.వడ్డేపల్లి, లింగనపల్లి, పాకాల, సామిరెడ్డిపల్లి, పంటపల్లి, చెన్నుగారిపల్లి, పెద్దబైనపల్లి గ్రామాల నుంచి భక్తులు స్వామి వారికి సారెను సమర్పించారు.

మహిళల చేతిలోనే కుటుంబ ఆరోగ్యం



అవగాహన కల్పించిన మహిళా వర్శిటీ అధ్యాపకులు

తిరుపతి రూరల్ : కుటుంబీకుల ఆరోగ్యం మహిళల చేతిలోనే ఉంటుందని శ్రీ పద్మావతీ మహిళా యూనివర్సిటీ అధ్యయన కేంద్రం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.హైమావతి అన్నారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం వంట నూనెల వినియోగాన్ని తగ్గించడం ద్వారా కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై మహిళా అధ్యయన కేంద్రం, రాష్ట్రీయ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని తిరుపతి సత్యనారాయణపురంలో నిర్వహించారు.మహిళా అధ్యయన కేంద్ర ప్రాజెక్ట్ అసిస్టెంట్ డాక్టర్. ఎం.ఇంద్రాణి, రాస్ ఫీల్డ్ ఆఫీసర్ బాలాజీ, అనిమేటర్ మాధవి, క్లస్టర్ లీడర్లు, మహిళలు పాల్గొన్నారు.

నయనానందం.. నృత్యాభినయం

తిరుపతి కల్చరల్: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా టీటీడీ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో గురువారం రాత్రి మహతి కళాక్షేత్రంలో కర్ణాటకకు చెందిన ఎంపీ. సుజీంద్రబాబు బృందం నవరస మేళవింపుతో నర్తించి సభికులను ఆకట్టుకున్నారు. ముద్దుగారే యశోదకు..., దశావతార స్తుతి ప్రదమైన పాల్కడలి..., అదివో అల్లదివో.., జయజయ దేవి, క్షీరాబ్ధి కన్యకకు..తదితర సంకీర్తనలకు చక్కటి అభినయంతో భక్త జన ప్రేక్షకులను అలరించారు.

పని గంటల పెంపు విరమించుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న కమ్యూనిస్టు నేతలు

చంద్రగిరి : కార్మికుల హక్కులను కాలరాస్తే సహించేది లేదని ఏఐటీయూసీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేవై.రాజ స్పష్టం చేశారు. పనిగంటల పెంపుతో పేదలపై భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి పాలనలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టానికి వ్యతిరేకంగా గురువారం స్థానిక టవర్ క్లాక్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. కేవై.రాజ, సీపీఐ మండల కార్యదర్శి శ్రీరాములు, సీపీఐ నాయకులు, గీత, పార్వతమ్మ, దేశమ్మ, కళావతమ్మ, గీత పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై ఆరోపణలు అవాస్తవం

తిరుపతి కల్చరల్: అవిలాల లెక్కదాఖలలోని సర్వే నంబర్ 13లో తాను భూమి ఆక్రమించానని జనసేన నాయకురాలు మల్లిశెట్టి లక్ష్మి చేసిన ఆరోపణలు అవాస్తవమని కమ్మకండ్రిగకు చెందిన మహేశ్వర్ నాయుడు తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వే నంబర్‌లోని 515 అంకణాల భూమిని 2017లో మమత నుంచి తాను కొనుగోలు చేశానని, రిజిస్ట్రేషన్ పత్రాలు తమ వద్ద ఉన్నాయన్నారు. అంతేకాకుండా గతంలో సమస్య తలెత్తితే ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో ఆయన విచారణ చేసి ఆ భూమి తమదేనని నిర్ధారించి రాతపూర్వకంగా లెటర్ కూడా ఇచ్చారని, భూమిలో తాము నిర్మాణాలకు పూనుకుంటే కొందరిని తీసుకొచ్చి మల్లిశెట్టి లక్ష్మి అడ్డుకోవడంతో తాము ఎంఆర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. తమ ఒరిజినల్ పత్రాలను పోలీసులు పరిశీలించారని, అయితే ఆమె ఎలాంటి పత్రాలు చూపకపోగా తమపై తప్పుడు ఆరోపణలు చేస్తూ, ఇబ్బందులకు గురి చేస్తోందని వాపోయారు. ఆమెపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో మహేశ్వరనాయుడు సోదరులు విజయభాస్కర్, ద్వారకనాథ్ పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న ఇసుక మాఫియా



జేసీబీ సాయంతో అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్న టీడీపీ నేత



తరలించిన ఇసుక, గ్రావెల్‌ను అక్రమంగా డంపు చేసి విక్రయిస్తున్న కూటమి నేతలు

చంద్రగిరి : మండల పరిధిలోని ఏ.రంగంపేటలో గ్రావెల్, ఇసుక మాఫియాకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. నిత్యం ఇక్కడ నుంచి గ్రావెల్, ఇసుక అక్రమ రవాణా కూటమి నేతల కనుసన్నల్లో యథేచ్ఛగా సాగిస్తున్నారు. పంచాయతీ పరిధిలోని నాగపట్ల చెరువులో నాలుగు రోజులుగా పంచాయతీకి చెందిన ఓ నేత అక్రమంగా జేసీబీలు, ట్రాక్టర్ల సాయంతో గ్రావెల్‌ను తరలించి రూ.లక్షలు దోచేస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధి పేరు చెప్పి ఇసుక, గ్రావెల్ అక్రమ దందాను సాగిస్తున్నట్లుగా స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ సాగుతున్న దందాలో రెవెన్యూలోని ఓ అధికారితో పాటు పోలీసు శాఖలోని కొంత మందికి వారం వారం వాటాలు వెళ్తున్నట్లుగా రంగంపేటలో ఆరోపణలు చెలరేగుతున్నాయి. ఇకనైనా రంగంపేటలో జరుగుతున్న అక్రమ దందాపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గజలక్ష్మి అలంకరణలో మూలస్థాన ఎల్లమ్మ



గజవాహనంపై విహరిస్తున్న శ్రీమూలస్థాన ఎల్లమ్మ





అన్నపూర్ణ దేవిగా శ్రీసంతోషిమాత, అన్నపూర్ణా దేవిగా చాముండేశ్వరి అమ్మవారు

చంద్రగిరి : చంద్రగిరి గ్రామ దేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు గజలక్ష్మి అవతారంలో గ్రామ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ ఈఓ మమత, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

అన్నపూర్ణదేవిగా శ్రీసంతోషిమాత

స్థానిక ఆర్‌ఎఫ్ రోడ్డులోని పుట్టాలమ్మ ఆలయ అనుబంధ శ్రీసంతోషిమాత గురువారం అన్నపూర్ణదేవిగా భక్తులను అనుగ్రహించారు.

అన్నపూర్ణ దేవిగా చాముండేశ్వరి

తిరుపతి రూరల్ : తుమ్మలగుంట క్రాస్ రోడ్డు ఎల్ఎస్‌నగర్ వద్దనున్న శ్రీ శక్తి చాముండేశ్వరి అమ్మవారు గురువారం అన్నపూర్ణ దేవిగా దర్శనమిచ్చారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

ఎంబీయులో ఘనంగా ఫార్మసిస్ట్ దినోత్సవం



ఆర్ఎక్స్ ఆకారంలో ఎంబీయు విద్యార్థినులు

చంద్రగిరి : మోహన్ బాబు యూనివర్శిటీ (ఎంబీయు)లోని ఎంబీ స్కూల్ ఆఫ్ ఫార్మా స్యూటికల్ సైన్సెస్‌లో గురువారం ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు రంగోలి, పోస్టర్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఔషధాల సరైన వాడకంపై విద్యార్థులు కూచివారిపల్లి, బందార్లపల్లి, రంగంపేట గ్రామాలను సందర్శించి అవగాహన కల్పించారు.

మహిళా వర్సిటీలో..

తిరుపతి: ప్రపంచ ఔషధ నిపుణుల దినోత్సవం సందర్భంగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, ఫార్మసీ కళాశాలలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఔషధ నిపుణుల ప్రాముఖ్యత, వారి సేవల గురించి విద్యార్థినులకు వివరించారు. ఈ ఏడాది 'థీమ్ థింక్..హెల్త్ థింక్ ఫార్మసిస్ట్' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థినులకు బహుమతులు అందచేశారు. వీసీ ఆచార్య వీ.ఉమ, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.రజని, స్కూల్ ఆఫ్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ టి.సుధా, ఫార్మసీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్.జ్యోత్స్నారాణి, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



మహిళా వర్సిటీలో ర్యాలీ చేస్తున్న ఫార్మసీ విద్యార్థినులు, అధ్యాపకులు

పౌష్టికాహారంపై అవగాహన

రామచంద్రాపురం : పోషణ మహోత్సవాలలో భాగంగా గురువారం రామచంద్రాపురం ఎస్టీ కాలనీలో స్వచ్ఛత పరిశుభ్రతా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మనీలా.. మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రత , పిల్లల పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించారు. మండల సెక్టార్లోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎస్టీ కాలనీ, మహిళలు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో అంతర్జాతీయ బధిరుల వారోత్సవాలు





మాట్లాడుతున్న డైరెక్టర్ ఆర్వీ కుమార్, ఎస్వీ మెడికల్ కాలేజీలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రవిప్రభు

తిరుపతి తుడా: స్విమ్స్‌లో ఈఎన్‌టీ విభాగం గురువారం అంతర్జాతీయ బధిరుల వారోత్సవాలను ఘనంగా నిర్వహించింది. డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ మాట్లాడారు. వినికిడి లోపం పుట్టుకతోగానీ లేదా ఏయే కారణాలతో వస్తుందో ఆయన అవగాహన కల్పించారు. వినికిడి సమస్య ఉన్నవారు ఇఎన్‌టి విభాగం డాక్టర్లను సంప్రదించాలని, వారోత్సవాల్లో భాగంగా ఉచిత వైద్యసేవలు అందించినట్టు చెప్పారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ అమర్నాథ్, డాక్టర్ భానుప్రదీప్, డాక్టర్ సాయి మౌర్య, ప్రత్యూష, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలో ప్రపంచ ఔషధ నిపుణుల దినోత్సవం

తిరుపతి తుడా: ఎస్వీ వైద్య కళాశాల ఫార్మకాలజీ విభాగం గురువారం ప్రపంచ ఔషధ నిపుణుల దినోత్సవం ఘనంగా నిర్వహించింది. ప్రిన్సిపాల్ డాక్టర్ జీ.రవి ప్రభు, రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జే. రాధ మాట్లాడారు. రోగులకు డాక్టర్లతోపాటు ఫార్మసిస్టులు అందించే సేవలు ఎంతో కీలకమని ప్రస్తుతించారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ భారతి, ఫార్మసిస్టుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాదముని, సభ్యులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత పండిట్ దీన్‌దయాళ్

తిరుపతి అర్బన్/చంద్రగిరి : పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఓ సిద్ధాంతకర్త, స్ఫూర్తి ప్రదాత అని తిరుపతి గంగమ్మ గుడి శక్తి కేంద్ర ఇన్‌చార్జి గుండాల గోపీనాథ్ స్మరించారు. గురువారం తిరుపతిలో ప్రధాన తపాలా కార్యాలయం వద్ద , చంద్రగిరిలో టవర్ క్లాక్ వద్ద దీన్‌దయాళ్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు చంద్రబాబు యాదవ్, సుబ్రహ్మణ్యం రెడ్డి, ప్రసాద్ బాబు, విజయభాస్కర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, అన్నారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రాజాబాబు నాయుడు, చంద్రగిరి మండల అధ్యక్షుడు మునిరాజ, జిల్లా బీజేపీ మాజీ ప్రధాన కార్యదర్శి వెంకటముని బీజేపీ సీనియర్ నాయకుడు సుబ్రమణ్య యాదవ్, మునిగంగిరెడ్డి, చంద్రబాబు యాదవ్, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు, మహిళా మోర్చా నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల అవతారం ఎత్తారు!



స్వచ్ఛత హి సేవలో పాల్గొని శుభ్రం చేస్తున్న డిప్యూటీ మేయర్, వీసీ, అధికారులు

తిరుపతి తుడా: పరిసరాల శుభ్రతతో స్వచ్ఛ తిరుపతి సాధ్యమని, ఆ దిశగా ప్రజలందరూ సహకరించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఉదయం మహిళా విశ్వవిద్యాలయం, ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌లో శ్రమదానం చేశారు. కొంతసేపు పారిశుధ్య కార్మికుల అవతారం ఎత్తి శుభ్రం చేశారు. ఎమ్మెల్యేతోపాటు మహిళా వర్సిటీ వీసీ ఉమ, నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ అమరయ్య మాట్లాడారు. కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వూకా విజయ్ కుమార్, రజక కార్పొరేషన్ మెంబర్ కరాటే చంద్ర, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మహిళా వర్సిటీ రిజిస్ట్రార్ రజని, హెల్త్ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది, వర్సిటీ విద్యార్థినులు పాల్గొన్నారు.

డోంట్‌వర్రీ..అండగా ఉంటాం..!

శ్రీవారి భక్తులకు శక్తి టీమ్ అభయం

తిరుపతి అర్బన్: ''శ్రీవారి దర్శనానికి వచ్చారా..? తిరుపతి మీ ఊరుగానే భావించండి..ధైర్యంగా దైవ దర్శనం చేసుకోండి'' అంటూ శక్తి టీమ్ ఏఎస్ఐ గిరిజ భక్తులకు భద్రతపై అవగాహన కల్పించారు. తిరుమల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో దూర ప్రాంతాల నుంచి శ్రీవారి దర్శనార్థం వచ్చిన భక్తులకు గురువారం తిరుపతి బస్టాండ్‌లో శక్తి టీమ్ బృందం మాట్లాడింది. ఏదైనా ఆపద అనిపిస్తే 112కి డయల్ చేస్తే పోలీసులు అండగా ఉంటారని, అలాగే ఉమెన్స్ హెల్ప్‌లైన్‌కు సంబంధించి 181కి డయల్ చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ శాంతి, మహిళా పోలీసులు పాల్గొన్నారు.